కామన చేతికి కాంగ్రెస్ పగ్గాలు

పార్టీ జిల్లా అధ్యక్షునిగా నియామకం

విశాలాంధ్ర - మండపేట : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పార్టీ సీనియర్ నేత, ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు తాత్కాలిక జిల్లా అధ్యక్షునిగా ఉన్న జంగా గౌతమ్ ఏపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షునిగా నియామకం కావడంతో డీసీసీ అధ్యక్ష పదవికి ఖాళీ ఏర్పడింది. పార్టీలో సీనియర్ నేతగా ఉన్న కామనను ఈ పదవి వరించింది. మూడున్నర దశాబ్దాలకు పైగా కామన కాంగ్రెస్‌పార్టీలో కొనసాగుతున్నారు. రాష్ట్రస్థాయితో పాటు జాతీయస్థాయిలోను పార్టీలోని ముఖ్యులతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, కొనిజేటి రోశయ్య తదితరులు కామనకు ఎంతో ప్రాధాన్యమిచ్చేవారు. పార్టీ జిల్లా అధ్యక్షునిగా కామన నియామకం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూరు శాతం ఇంటి పన్ను వసూలు

విశాలాంధ్ర - అనపర్తి : నూటికి నూరు శాతం ఇంటి పన్ను వసూళ్లో కొప్పవరం రెండవ ఏడాది కూడా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని సర్పంచ్ కర్రి బుల్లి మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం సర్పంచ్ బుల్లి మోహన్ రెడ్డి మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేవలం 15 రోజుల్లో వాలంటీర్ల కృషితో 8 లక్షల 13 వేల 2 వందల 12 రూపాయలు పన్ను వసూలు అయినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్న సర్పంచ్ బుల్లి మోహన్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, నూటికి నూరు శాతం ఇంటి పన్ను వసూలుకు కృషి చేసిన వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శుల కృషిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో బిఎల్ నరసింహం అభినందించారు.

328 మందికి పింఛను పంపిణీ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన 328 వైఎస్సార్ పెన్షన్‌లను, కొత్త రేషన్ కార్డులు 111, ఎంఎల్‌సి మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీల అమలులో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. లబ్ధిదారుల గుర్తింపులో రాజకీయ జోక్యం లేకుండా, కులాలకు అతీతంగా మంజూరు చేసి, అర్హతఉన్న వారికి పథకాలు అందిస్తున్నా మని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అ ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, జెడ్పీటీసీ పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ అబ్బు, పుట్టకిట్టబాబు, ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి, ఎంఆర్ఓ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వాగ్దానాలన్నీ అమలు పరుస్తున్న సీఎం

విశాలాంధ్ర - అనపర్తి : జనవరి నెల నుండి పెంచిన పెన్షన్ రూ.250తో కలిపి రూ.2750తో పాటు నూతనంగా మంజూరైన పెన్షన్లు లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమంలో వలంటీరుతో పాటు 12వ వార్డులో పంచాయతీ పాలకవర్గ సభ్యులు సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ఎస్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలన్నీ తూచా తప్పకుండా అమలు పరుస్తున్నారని అన్నారు. అందులో భాగమే పెన్షన్ల పెంపు అని విశాలాంధ్రతో చెప్పారు.

జీవో నెంబర్ 1 రద్దు చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : జీవో నెంబర్ వన్‌ను రద్దు చేయాలని, జనసేన ఈ జీఓను పరిగణనలోకి తీసుకోవడం లేదని జనసేన పిఏసి సభ్యుడు పంతం నానాజీ ఆధ్వర్యంలో జనసైనికులు కాకినాడ రూరల్ గుడారి గుంటలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈనెల 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించే యువశక్తి కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేవలం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర పర్యటనకు సంబంధించి వారాహి వాహనాన్ని రోడ్డు ఎక్కకుండా చేయడంలో భాగంగానే బ్రిటిష్ కాలంనాటి 1861 పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తూ తీసుకొచ్చిన జీవో ఈ కుట్రలో భాగమే అన్నారు. ఈ సందర్భంగా యువశక్తి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్, కరప మండలం అధ్యక్షులు, నియోజకవర్గం నాయకులు, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సాంప్రదాయ క్రీడలతో పండుగలు ఆనందమయం

విశాలాంధ్ర - పెదపూడి : సాంప్రదాయ క్రీడలతో పండుగలు ఆనందమయంగా చేసుకోవాలని పెదపూడి ఎస్సై పి.వాసు అన్నారు. రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రమైన పెదపూడిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు ఎస్సై వాసు అందజేశారు. కార్యక్రమంలో పెదపూడి పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : తన కుమారుడు జ్ఞాపకార్థం ప్రముఖ సంఘ సేవకర్త ఎండి అధికార్ స్థానిక భవిత మనోవికాస దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికార్ మాట్లాడుతూ తన చిన్న కుమారుడు మహమ్మద్ ఉమర్ అలీ ఖాన్ అరుదైన వ్యాధితో పది సంవత్సరాల క్రితం పరమపదించాడని, ఆయన జ్ఞాపకార్థం పుట్టినరోజు నాడు ప్రతి సంవత్సరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 23వ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పెద్ద కుమారుడైన మహమ్మద్ మోహిద్దిన్ ఖాన్ ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర - దేవరపల్లి : పార్డ్ ఇండియా వ్యవస్థాపకులు బేతలా వీరాస్వామి కుమార్తె బేతళ స్పందన పుట్టిన రోజు వేడుకలను పార్డ్ ఇండియా ఆఫీస్ లో ఘనంగా జరిగాయి. కార్యక్రమం సందర్భంగా ఎర్న గూడెం రీడ్ సెంటర్ విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, స్వీట్స్ అందజేశారు. ఈ కార్యక్రమం లో పార్డ్ ఇండియా సభ్యులు రవీంద్ర, శ్రీనివాస్, నాగారాజు, స్పందన కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియ జేశారు, ఈ కార్యక్రమం లో పార్డ్ ఇండియా రీడ్ డైరెక్టర్ వెంకట్రావు, రీడ్ టీచర్ నాగమణి పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ప్రజా కంటక పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని గద్దె దించడం కోసం సీపీఐ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని, ప్రజల వద్దకు వెళ్లి జగన్ దురాగతాలను వివరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో తూర్పుగోదావరి జిల్లా జనరల్ బాడీ సమావేశం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం కన్నా వైసీపీ ప్రభుత్వం దారుణంగా ఉందని అన్నారు. ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్య, మానవ హక్కులు హరించబడుతున్నా యన్నారు. ప్రశ్నించే వాడిపై వివిధ రూపాల్లో అక్రమ కేసులు పెట్టి భయాందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏ వర్గం ఆనందంగా లేరని, దళిత ,మైనార్టీ ,గిరిజన వర్గాలపై దాడులు తీవ్రమయ్యా యన్నారు. ఏపీ ప్రత్యేక హోదా విభజన చట్ట హామీల అమలు సాధన కోసం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జనవరి 2 నుండి ఫిబ్రవరి 4 వరకు జరిగే బస్సు యాత్రకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జనవరి 23, 24 తేదీలలో ప్రజా సంఘాలతో కలిపి రెవెన్యూ డివిజన్లో వద్ద ఆందోళన చేస్తామని ఆమె అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ జగనన్న ఇల్లు లబ్ధిదారులు కొత్త ఇల్లు నిర్మించుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేరళ, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాల్లో నూతన ఇళ్ల నిర్మాణాలకు నాలుగు లక్షల వరకు పైన సాయం చేస్తున్నారని జగన్ ప్రభుత్వం కూడా ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని మధు కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి వి. కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ, పార్టీ సీనియర్ నాయకురాలు ఎర్ల లక్ష్మి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. జ్యోతి రాజు, ఎ. సత్యనారాయణ, సిహెచ్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రదర్శన, బహిరంగ సభల జీవోలకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం గురువారం స్థానిక సాంబమూర్తి నగర్లోని పిఆర్ భవన్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్బంధ పరిపాలన కొనసాగుతోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాల పై నిరసనలు, ధర్నాలు చేసిన వారిపై కేసులు కట్టి నిర్బంధాలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలు రుణాలను మంజూరు చేయాలని, ప్రజాధనంతో నిర్మించిన టిడ్కో గృహాలు శిథిలస్థితికి చేరకముందే ప్రజలకు బకాయి పనులు పూర్తి చేసి ఆ ఫ్లాట్స్ మంజూరు చేయాలని మధు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోకల ప్రసాద్, జి. లోవరత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి సత్యనారాయణ (పిఎస్) ఎమ్మెస్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రూపాయి ప్లీజ్

ఫేస్‌బుక్‌లో పోస్టుకు రూ.31వేల సాయం

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఆయన పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడే కాదు. సామాజిక సేవా దృక్పథం కలిగిన సేవకుడు కూడా. కాట్రేనికోన జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న లంకే హేమ శ్రీనివాసరావుకు పేద విద్యార్థులకు సాయం చేయాలని ఆలోచన వచ్చింది. హైస్కూల్ దగ్గర లోని చెంచుల గరువులో దుర్భర దయనీయ జీవితాలు గడుపుతున్న చెంచుల కుటుంబాలను చూసి చలించి పోయారు. వీరి కుటుంబాల్లో మగవారు పక్షులు, జంతువులు వేటాడుతారు. ఆడవారైతే ఉదయం నుండి సాయంత్రం వరకు యాచక వృత్తిలో గడుపుతారు. వారి పిల్లలు నాగరికత సమాజానికి దూరంగా అపరిశుభ్ర వాతావరణంలో జీవనం సాగిస్తూ విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ సాయం చేయాలని శ్రీనివాసరావుకు ఆలోచన వచ్చిందే తడవుగా ఒక్క రూపాయి ప్లీజ్ అంటూ తన ఫేస్బుక్లో మెసేజ్ పోస్ట్ చేయడంతో స్నేహితుల నుండి విపరీతమైన స్పందన వచ్చింది. తన అకౌంట్లో ఉన్న 3000 మంది రూపాయి చొప్పున ఫోన్ పే నెంబర్‌కు జమ చేస్తే 3000 రూపాయలు వస్తుందని ఆశించిన ఆ టీచర్కు 107 మంది రూ.31,687 వేలు పంపడంతో అవాక్కు అవడంతో పాటు ఆనందం వెలిబుచ్చాడు. వెంటనే సహచర ఉపాధ్యాయులతో సంప్రదించి రూ.13,460లతో 100 శానిటేషన్ కిట్లను (మూడు లక్స్ సోపులు, కోల్గేట్ పేస్టులు, బ్రష్‌లు, క్లినిక్ షాంపులు) కొనుగోలు చేసి వందమంది విద్యార్థులకు పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు. మిగిలిన సొమ్ము పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావుకు చెక్కుద్వారా అందించి ఫిక్సడ్ డిపాజిట్ చేసిన ఆ సొమ్ము పై వచ్చిన వడ్డీని ప్రతి యేటా పదవ తరగతిలో మెరిట్ సాధించిన ఒకవిద్యార్థికి ప్రతిభా పురస్కారం ద్వారా ఆర్థిక సాయం చేయడానికి నిర్ణయించారు. నిస్వార్థంగా ఉపాధ్యాయుడు హేమ చేసిన సేవా కార్యక్రమానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

విశాలాంధ్ర - మామిడికుదురు : కొమరాడకు చెందిన శృంగవరపు విజయదుర్గను అదనపు కట్నం కోసం వేధిస్తున్న నేరంపై అతని భర్త శ్రీనివాస్‌తో పాటు అత్త సారాదేవిపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా గురువారం తెలిపారు. రాజోలు ఏజేఎఫ్సీఎం కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు నమోదు చేశామన్నారు. కొమరాడకు చెందిన విజయదుర్గకు సఖినేటిపల్లి మండలం రామేశ్వరానికి చెందిన శ్రీనివాస్‌తో 2011 నవంబర్ 19వ తేదీన వివాహం జరిగిందన్నారు. అప్పట్లో కట్నం రూపేణా రూ.నాలుగు లక్షలు నగదు, అయిదు కాసులు బంగారం ఇచ్చారని చెప్పారు. విజయదుర్గ దంపతులకు కొడుకు, కూతురు సంతానం ఉన్నారని చెప్పారు. 2021వ సంవత్సరం జనవరిలో సంక్రాంతి పండుగకు విజయదుర్గను భర్త శ్రీనివాస్ కొమరాడలో పుట్టింటి వద్ద దించేసి గల్ఫ్ వెళ్లిపోయాడన్నారు. అప్పటి నుంచి తనను అత్తింటికి రాకుండా భర్త, అత్త అడ్డుకుంటున్నారని, అత్తింటికి వెళ్లగా తనపై దాడి చేశారని, రూ.రెండు లక్షలు అదనపు కట్నం తీసుకు రావాలని తనను వేధించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై జానీబాషా తెలిపారు.

ఆదాయం ఒనగూరే రంగాల్లో పెట్టుబడి పెట్టి సుస్థిర జీవనోపాధులు పొందాలి

విశాలాంధ్ర - అమలాపురం : వైయస్సార్ చేయూత, ఆసరా, జగనన్న తోడు కార్యక్రమాల ద్వారా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ మెప్మా విభాగం బ్యాంకర్ల సమన్వయంతో ఆదాయ వనరులు ఒనగూరే రంగాలలో పెట్టుబడి పెట్టించి సుస్థిర జీవనోపాదులు కల్పన దిశగా పాటుపడాలని జిల్లా కలెక్టర్ హిమా న్షు శుక్లా ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులు ఉద్దేశించి మాట్లాడుతూ ఉగాది నాటికి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షలు గృహ నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని లక్ష్యంగా నిర్దేశించిందని ఆ దిశగా గృహ నిర్మాణ సంస్థ గృహ నిర్మాణాలను స్టేజ్ కన్వర్షన్ విధానంలో పురోగతి సాధించి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. బిల్లులు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని, ప్రస్తుత వర్కింగ్ సీజనులో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణ పనులకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డ్వాక్రా సంఘాలలో ఉన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.35 వేలు మంజూరు చేస్తూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద వైఎస్ఆర్ అర్బన్, గ్రామీణ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణ కుమారి డ్వామా పీడీ ఎస్ మధుసూదన్, గృహ నిర్మాణ సంస్థ పిడి సిహెచ్ బాబురావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కాకినాడ జిల్లా ఉద్యాన అధికారి ఎన్.మల్లికార్జునరావు, డీఆర్‌డీఏ పీడీ శివ శంకర ప్రసాద్, సిపిఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జీవో నెం. 1 రద్దు చేయాలి

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ, సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టి జీవో ప్రతులను తగలబెట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కె. సత్తి బాబు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఈ జీవో తీసుకొచ్చిందన్నారు. పోలీసులకు సర్వాధికారాలు కట్టబెట్టడం ప్రజా స్వామ్య వ్యవ స్థకే ప్రమాదం అన్నారు. పోరాడి సాధించుకున్న పౌరహక్కుల్ని ఏ పేరుతో అణచివేసినా వ్యతిరేకి స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి రాము, సమితి సభ్యులు అడపా సత్యనారాయణ, శీలం వెంకటేష్, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖి సూర్యనారాయణ, అధ్యక్షులు కుడుపూడి రాఘవమ్మ, సహాయ కార్యదర్శి పాము బాలయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి. వసంత్ కుమార్, ఉపాధ్యక్షులు అయితా బత్తుల ఈశ్వర్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - కరప : ఎస్సీ, ఎస్టీల ఓట్లతో గద్దెనెక్కిన జగనమోహన్ రెడ్డి, వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడే 27 పథకాలను రద్దు చేయడం అన్యాయమని, వెంటనే ఆయా పథకాలను పునరుద్ధ రించాలని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. కరప శివారు రామకంచి రాజు నగర్‌లో గురువారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడి మూడున్నరేళ్లు గడిచినా, ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన నిధులను నవరత్నాలు లాంటి పథకాలకు మళ్లించడాన్ని బట్టి ఎస్సీ, ఎస్టీలపై వారి కపట ప్రేమ అర్థమౌతుందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విదేశీ విద్య, భూమి కొనుగోలు పథకాలను నిలిపివేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ కూడా చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాకరపల్లి.బుజ్జి చౌదరి, గొల్లపల్లి బుజ్జి, గంజా రాంబాబు, గండి వెంకటేశ్వరరావు, బుంగా సింహాద్రి, పేపకాయల సత్తిబాబు, మద్దూరు స్వామి, మాజీ ఎంపీటీసీ సత్య, వెంకటలక్ష్మి, చాట్రా ఇమ్మానుయేల్, కోటగిరి మహేంద్ర, మట్టపర్తి కొండ, గుబ్బల భాస్కరరావు, గంటా వీరన్న చౌదరి, యలమంచిలి సుకుమార్, మాత అబ్బాయి, పులుపుకూర మహేష్, కన్నా రావు, పంపన బుజ్జి, సాంబశివరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌతు చంటిబాబు కుటుంబానికి జ్యోతుల నెహ్రూ పరామర్శ

విశాలాంధ్ర - కిర్లంపూడి : మండల కేంద్రమైన కిర్లంపూడికి చెందిన గౌతు చంటిబాబు కుటుంబా నికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం పరావ ర్శించారు. గౌతు చంటి బాబు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న నెహ్రూ చంటిబాబు కుటుంబ సభ్యులు గౌతు గంగాధర్, జగన్మోహన్ రావు, ఉప సర్పంచ్ గౌతు జగన్నాధరావు, గౌతు చిన్నతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, పాలచర్ల సత్యనారాయణ, చదరం చంటిబాబు, కాళ్ల దొంగబాబు, కుర్ల చినబాబు, తూము కుమార్, యడ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు

విశాలాంధ్ర - కిర్లంపూడి : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందివ్వడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గురువారం మండల కేంద్రమైన కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం 2500 నుండి 2750 పెంచిన పింఛను సొమ్మును పెన్షన్ దారులకు అందజేశారు. ఎంపీపీ తోట రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటి బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ మంజూరు చేయడమే కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారు అందరికి అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట గాంధీ, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబి, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కలప తరలిస్తున్న వాహనం సీజ్

విశాలాంధ్ర - గోపాలపురం : అక్రమంగా టేకు కలపదిమ్మలను తరలించే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని.ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి. సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని గోపవరం గ్రామ సమీపాన బుధవారం రాత్రి 12.00 గంటలకు పెట్రోలింగ్ చేస్తూ టేకు దిమ్మలను అక్రమంగా తరలిస్తున్న,రూ లక్ష రూపాయలు విలువగల టేకు దిమ్మలనుబొలెరో వాహనాన్ని పట్టుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి.సత్యనారాయణ తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పెట్రోలింగ్ సమయంలో అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి వాహనమును,టేకు దిమ్మలను సీజ్ చేసినట్లుగా తెలిపారు. జప్తు చేసిన బొలెరో వాహనం, దిమ్మలని రేంజ్ కార్యాలయం, రాజమహేంద్రవరం నకు తరలించారు.ఈ దాడులలో అటవీ శాఖ అధికారులు డిఆర్ఓ శ్రీనివాసరావు,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ .కార్తిక్, వై.శ్రీను పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - గండేపల్లి : యువత చెడు మార్గమును వీడి సన్మార్గంలో వెళ్లేందుకు సంప్రదాయ సంక్రాంతి సంబరాలలో గ్రామీణ క్రీడలు నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం డిఎస్‌పి సుంకర మురళీమోహన్ అన్నారు. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు ఆదేశాల మేరకు, గండేపల్లిలో కబడ్డీ, పోటీలు నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం డిఎస్‌పి సుంకర మురళీమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువత మానసిక ఒత్తిడిని తట్టుకోలేక అనేక వ్యసనాలకు గురవుతున్నారని వాటి నుండి దారి మళ్లించే వీలుంటుందన్నారు. జగ్గంపేట హైస్కూల్ గ్రౌండ్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను, గండేపల్లిలో కబడ్డీ పోటీలను, కిర్లంపూడిలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐ సూర్య అప్పారావు, ఎస్సై గణేష్ కుమార్, ఎంపీపీ చలగళ్ళ దొరబాబు, జడ్పిటిసి పరిమి వెంకటలక్ష్మి, మంగతాయారు బాబు, కందుల చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో శ్రీమహితికి బంగారు పతకాలు

విశాలాంధ్ర - సీతానగరం : సైన్స్ ఒలింపియాడ్‌లో శ్రీమహితి బంగారు పతకాలు సాధించారని కరస్పాండెంట్ ఎ. శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో జోనల్ స్థాయిలో కాటవరం గ్రామంలోని శ్రీమహతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు మొత్తం 52 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించగా 22 మంది విద్యార్థులు లెవెల్ 2 పరీక్షకు ఎంపిక అయ్యారని ఐఐటి అకాడమిక్ డైరెక్టర్ ఎ. రాం ప్రసాద్ విలేకర్ల సమావేశంలో తెలిపారని అన్నారు. విజయం సాధించిన విద్యార్థులు, ఉపా ధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పొగాకు తోటల పరిశీలన

విశాలాంధ్ర - దేవరపల్లి : మండలంలో ఫీల్డ్ ఫ్రెండ్స్ డే సందర్భంగా సంగాయి గూడెం , గాంధీనగర్ గ్రామాల్లోని వర్జీనియా పొగాకు తోటలను టొబాకో బోర్డ్ ఆర్ ఎం జి ఎల్ కె ప్రసాద్ ఐటీసీ ప్రతినిధి యశ్వంత్ ప్రతినిధి రవి ఎస్ జి ఓ శివకుమార్ హరే రామ్ రైతులు కరుటూరి శ్రీనివాసరావు శరత్ బాబు తదితరులు పరిశీలించారు.

కబడ్డీ పోటీల్లో వివిఎస్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల్లో వివిఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం పొందారు. ఈ సందర్భంగా వివిఎస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కబడ్డీ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి గెలుపొందిన కప్పును తీసుకువచ్చిన క్రీస్తు, దాస్, వంశీ, శ్రీను, ప్రసాద్, వేణు విద్యార్థులకు వీవీఎస్ విద్యాసంస్థల అధినేత అనిశెట్టి కృష్ణారెడ్డి ఆటలో కనబరిచిన విద్యార్థులను ఆయన మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థుల ఆటపాటలతో కూడా రాణించాలని ఆయన సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఆటల్లో రాణించి ప్రతిభను కనబరచాలని ఆయన కోరారు. గెలుపొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ కోత

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు అమలాపురం విద్యుత్ ఈఈ ఎం. రవి కుమార్ తెలిపారు. కాట్రేనికోన ఫీడర్స్, పల్లంకుర్రు ఫీడర్స్, ఆర్‌డబ్ల్యూఎస్ 1 ఫీడర్ పరిధిలో కొత్త లైన్ పనులు చేసే నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు అసౌకర్యం గమనించాలని ఆయన కోరారు. కాట్రేనికోన, వేట్లపాలెం, గచ్చకాయలపోర, చిర యానం, ఉప్పూడి, పెనుమల్ల, బంటుమిల్లి, లక్ష్మీవాడ, నడవపల్లి, గెద్దనపల్లి, దొంతుకూరు, కొప్పిగుంట, కందికుప్ప, పల్లంకుర్రు బలుసు తిప్ప గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈఈ రవికుమార్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి గ్రామసభ

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : గ్రామాల అభివృద్ధి కోసం గ్రామసభ అవసరమని ఎండపల్లి సర్పంచ్ శీలం పెద్ద అప్పారావు అన్నారు. గురువారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ సభ సమావేశం ద్వారా గ్రామంలో ఉన్న సమస్యలు అధికారులు, నాయకులు ధ్రుష్టికి చేరుతాయాన్ని అన్నారు. పలువురు గ్రామంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం నూతనంగా మంజూరైన 17 పెన్షన్లను నాయకుల చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కన్వీనర్లు, పంచాయతీ కార్యదర్శి డి. రవికుమార్, ఆదిత్య,గంగాధర్, మల్లేశ్వరరావు, గ్రామ వాలంటీర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

విశాలాంధ్ర - దేవరపల్లి : ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం పరిశీలించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలను కలుపుతున్న ఈ గ్రీన్ ఫీల్డ్ రహదారి 162 కిలోమీటర్లు ఏర్పడుతుందని తెలిపారు . దేవరపల్లి మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు వస్తుందని భూములు ఇచ్చిన రైతుల కోసం అండర్ పాస్ లు సర్వీసు రహదారులు పంట పొలాలకు వెళ్లే రోడ్లను ఏర్పాటు చేయాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని దృష్టికి తీసుకెళ్లామని, రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వివరించినట్లు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు.

6 నుంచి సచివాలయాలలో సదరం సర్టిఫికేట్స్ స్లాట్ బుకింగ్

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోనీ సచివాలయాలలో రేపటి నుండి జనవరి, ఫిబ్రవరి మరియు మార్చి నెలల వరకు గల సదరం సర్టిఫికెట్స్ స్లాట్ బుకింగ్ ప్రారంభం అవుతాయనీ, మానసిక, శారీరక వికలాంగులకు సంబంధించిన సర్టిఫికేట్లు అవసరమైన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, దగ్గరలో ఉన్న సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని ఆత్రేయపురం ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. ఈసారి స్లాట్ బుకింగ్‌లో కొన్ని కొత్త అప్డేట్స్ కూడా వస్తున్నాయని అన్నారు. స్లాట్ బుకింగ్, అప్పీల్ 1,అప్పీల్ 2 ఈ మూడు ఆప్షన్స్ ఎనేబుల్ చేయబడ్డాయని వాటిని ఈ విధంగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరపాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : భీమవరం ప్రతిష్టను ఇనుమడింపజేసెలా శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు, దేవస్థానం, ఉత్సవ కమిటీ సభ్యులు సమిష్టి కృషితో నిర్వహించాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సూచించారు. ఈనెల 13 నుంచి

జరగనున్న శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి 59వ వార్షిక మహోత్సవాలపై అన్ని శాఖల అధికారులతో ఆర్డీవో దాసి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 58 ఏళ్లుగా నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ ఎంతో సమర్థవంతంగా ఉత్సవాలను నిర్వహించేదని, దేవస్థాన అధికారులు కూడా నిర్వహించే వారన్నారు. పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడిన నేపథ్యంలో ఈ ఉత్సవాలకు మరింత ప్రాధాన్యత పెరిగిందని, అందువల్ల అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని, తన వంతు సహకారం ఉంటుందన్నారు. ఆర్డీవో దాసి రాజు మాట్లాడుతూ ఉత్సవాల్లో తాగునీరు పారిశుధ్యంపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని డిఎస్ పి శ్రీనాథ్ కు సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రజీ, తహశీల్దార్ రవి కుమార్, అసిస్టెంట్ కమిషనర్ జ్యోతి లక్ష్మీ, తుటరాపు ఏడుకొండలు, రామాయణం గోవిందరావు, దేవస్థానం చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కార్యకర్తలు, సహాయకుల నియామక ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - ఏలూరు : అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకల నియామక ఇంటర్వ్యూలు ఏలూరు ఆర్డిఓ కార్యాలయంలో గురువారం ఆర్డిఓ కె. పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటిలో అంగన్వాడీ కార్యకర్తల 6 పోస్టులకు 7గురు హాజరు కాగా, అంగన్వాడీ సహాయకురాలు పోస్టుల ఖాళీలు 20 కాగా 41 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ప్రమోషన్ కింద 7 గురికి 9మంది హాజరైనట్లు ఏలూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె. పెంచల కిషోర్ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో ఆర్డిఓ పెంచల కిషోర్ తో పాటు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి, డిఎంహెచ్ఓ ఆఫీసు తరపున మెడికల్ ఆఫీసరు డాక్టర్ రవితేజ, ఏలూరు డివిజన్ లోని సిడిపిఓలు కె. విజయలక్ష్మీ, టిఎల్ సరస్వతి, పద్మావతి, రాజశేఖర్, మాధవి లావణ్య, భవానీ, స్వరాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నీతిమంతులను జ్ఞాపకం చేసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం : నీతిమంతులను జ్ఞాపకం చేసుకొనుట ఆశీర్వాదకరమని నేషనల్ బైబిల్ ఏపీస్కోపల్ డయాసిస్ క్రిస్టియన్ థియాలజీ కాలేజీ నిర్వాహకులు బ్రదర్ రొక్కాల నాగ బుజ్జి అన్నారు. గురువారం అర్ధవరం గ్రామంలో ఆదరణ కూడిక సి.బి.సి.ఎన్ .సి

చర్చి సి .ఆర్ పాతగొలుసుల జేమ్స్ అధ్యక్షతన ప్రార్థన కూడిక జరిగింది. ప్రార్థన కూడికలో బ్రదర్ .రొక్కాల నాగ బుజ్జి, పాస్టర్ సుందర్ సింగ్, పాస్టర్. జి. బాబ్జి, పాస్టర్. గుంపుల చంటిలు దేవుని వాక్యాన్ని ప్రకటించారు.గుంపుల సూర్య కళ, నేతల అజయ్ బాబు, దిడ్ల చంద్రకళ, నేతల విజయ్ బాబు, నేతల దయానంద బాపూజీ, గుంపుల ప్రవీణ్ కుమార్, గుంపుల ప్రశాంతి, నక్క ఆశ, నేతల నవీన్ కుమార్, నేతల మరియమ్మ, నేతల శాంతి, జయరాజు, గ్లోరీ, సాహితి, లిప్సిక, ప్రధీరాజు, రిత్విక్ రాజు, బంధువులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దాడులు ఆపాలి

విశాలాంధ్ర - గణపవరం: ఇటీవల రాజమండ్రిలో వైసిపి గుండాల దాడికి గురైన మహాసేన అధ్యక్షులు సరిపల్లె రాజేష్ ని ప్రత్తిపాడు నియోజకవర్గం ఉత్తర కంచి గ్రామంలో ఆయన స్వగృహంలో పలువురు కలిసి పరామర్శించి సంఘీభావం తెలిపారు. దాడికి గురైన వాహనాన్ని పరిశీలించిన వారిలో ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ , శ్రీ లక్ష్మీనారాయణ ట్రస్ట్ చైర్మన్ పత్సమట్ల ధర్మరాజు, జనసేన నాయకులు మైలవరపు సురేంద్ర, తోట పవన్, ఇల్లిందల సురేష్, తానేటి జోగేశ్వరరావు, కపెల్లి నాగు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో నాలుగు రోజుల పాటు గడప గడపకు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలో నాలుగు రోజుల పాటు గడప గడపకు ప్రభుత్వం జరుగుతుందని ఎంపిడివో కె. రమేష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడివో రమేష్ అధ్యక్షతన మండల, గ్రామ స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో రమేష్ మాట్లాడుతూ మండలంలో ప్రతీ గ్రామంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయితీ కార్యదర్శిలు నాలుగు రోజులు పాటు గ్రామంలో ఉన్న ప్రతీ ఇంటికి తిరుగుతూ వారి వారి సమస్యలను నమోదు చేయాలని ఆదేశించారు. ఈ గడప గడపకు అధికారులు అప్రమత్తంగా పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఈఓపిఆర్డీ సుజాత, కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాక్రిఫైజ్ మినిస్ట్రీస్ రగ్గుల పంపిణీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గ్రామంలో లివింగ్ శాక్రిఫైజ్ మినిస్ట్రీస్ అనే స్వచ్ఛంద సంస్థ 100 మందికి వికలాంగులకు ఉన్ని రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఎం దేవ సహాయం మాట్లాడుతూ మా సంస్థ ద్వారా అనేక మందికి పేదలకు, వృద్ధులకు, వితంతువు లకు, ఆపదలో ఉన్న

ప్రజలకు గత 25 సంవత్సరాల నుండి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ప్రజలకు సేవ చేస్తున్నామని తెలిపారు. పోలవరం నియోజవర్గంలో అన్ని మండలాలలో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. శీతాకాలంలో గత డిసెంబర్ నెల నుంచి ఇప్పటివరకు 1300 రగ్గులను పంపిణీ చేసామన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ గంజి మాల రామారావు, పరింపూడి సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, ముఖ్య అతిథులుగా పాల్గొని కొయ్యలగూడెం మండలంలో లివింగ్ శాక్రిఫైజ్ మినిస్ట్రీస్ అనే స్వచ్ఛంద సంస్థ ఉండడం మన గర్వకారణం అని తెలిపారు. సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి ఎం. ప్రేమకుమారి, వైసీపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ బాజీ, సంస్థ సభ్యులు కే సోమేశ్వరరావు, ఎం గణపతి ,ఎం దుర్గాప్రసాద్, బి కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 1ను వెంటనే రద్దు చేయాలి

విశాలాంధ్ర- తణుకు : రాజ్యాంగం ప్రకారం రాజకీయ పార్టీల హక్కులను, ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను హరించే విధంగా వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన చీకటి జీవో నం.1ను రద్దు చేయాలని మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. రోడ్ షో, బహిరంగ సభలు నిర్వహించబడదని విడుదల చేసిన జీవోను రద్దు చేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద

రాధాకృష్ణ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు పర్యటనలకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక, ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించటానికి వీలులేదని జీవో నం.1 జారీ చేయటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విమర్శించారు. అనంతరం జీవో నెంబర్ 1 పత్రాలను దగ్ధం చేశారు.ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ పార్టీ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, నరసాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ దొమ్మేటి వెంకట సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కాలేడు

విశాలాంధ్ర - పాలకొల్లు : రాబోయే కాలంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికీ ముఖ్యమంత్రి కాడు కాలేడు అని మాజీ డిసిఎంఎస్ చైర్మన్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి యడ్ల తాతాజీ స్పష్టం చేశారు గురువారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తాతాజీ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ తో కలిసి పోటీ చేసినా కూడా, మళ్లీ వైయస్ జగన్ భారీ మెజార్టీతో గెలుస్తారంటూ జోస్యం చెప్పారు

స్పందన ఫిర్యాదులపై నాణ్యమైన పరిష్కారం

విశాలాంధ్ర - భీమవరం : స్పందన ఫిర్యాదులపై మరింత నాణ్యమైన పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన దరఖాస్తుదారులకు జిల్లా అధికారులు జవాబుదారీతనంతో కూడిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. జిల్లా అధికారికి అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. క్రింది సిబ్బంది పరిష్కారం పై పంపిన ఫైలును పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరమే సంతకం చేసి పంపాలని తెలిపారు. ఫిర్యాదులు రీఓపెన్ అవ్వడం, నిర్ణీత గడువు దాటడం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించే లేదని హెచ్చరించారు. అధికారులను, అర్జీదారులను సమన్వయం చేసి అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం లభించే దిశగా ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీకి నోడల్ అధికారిగా డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ జిఎస్ డబ్ల్యుఎస్ ఆఫీసర్ కె.సి.హెచ్ అప్పారావు వ్యవహరిస్తారని, ఆడిట్ టీంలో జడ్పీ సీఈవో కె.వి.ఎస్.ఆర్ రవికుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దాసిరాజు,

పంచాయతీరాజ్ ఇఓ అండ్ ఆర్డి బి. రెడ్డియ్య, డిప్యూటీ తాసిల్దార్ పి.ఎన్ ప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ రంగమ నాయుడు ఉంటారని తెలిపారు. జిల్లా కార్యాలయాలకు అందిన స్పందన ఫిర్యాదులపై లబ్దిదారులకు పంపిన పరిష్కారాన్ని ఆడిట్ టీమ్ తనిఖీ చేసి వారికి చూపిన పరిష్కారం పై సంతృప్తి చెందక పోతే నివేదికను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో అందిన స్పందన ఫిర్యాదులను శాఖల వారీగా విభజించి ఏఏ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు నమోదవుతున్నాయనే సమాచారాన్ని కూడా క్రోడీకరించడం కూడా జరుగుతుందన్నారు. నాణ్యమైన పూర్తి పరిష్కారం అందించే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. జిల్లా అధికారులకు అందిన ఫిర్యాదును 24 గంటల్లోపు ఓపెన్ చేసి పరిశీలించి తదుపరి చర్యకు పంపాల్సి ఉంటుందన్నారు. నిర్ణీత గడువులోపుగా ఓపెన్ చేయనీ ఫిర్యాదులు సీఎంవో డాష్ బోర్డులో కనిపిస్తాయనీ తెలిపారు. అలాగే రీ ఓపెన్ అయిన ఫిర్యాదులపై సమాచారం సీఎం డాష్ బోర్డు కు చేరుతుందని, వివిధ సేవలకు చేసుకున్న దరఖాస్తులు ఓపెన్ అయితే లబ్ధిదారులతో సీఎంఓ నుండి నేరుగా మాట్లాడటం జరుగుతుందన్నారు. అభ్యంత రాలు వుంటే వాటిపై జిల్లా అధికారులకు సమాచారం అందుతుందన్నారు. దీనిపై నోడల్ అధికారి పర్యవేక్షణలో ఆడిట్ టీం విచారించి నివేదికను సమర్పించాల్సి ఉంటుందన్నారు. భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడిన నాటి నుండి (ఏప్రిల్ 4, 2022) నేటి వరకు 11,845 స్పందన ఫిర్యాదులు అందగా వాటిలో 11,305 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందన్నారు. 95శాతం పైగా ఫిర్యాదులను పరిష్కారం చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర - కాళ్ళ : అర్హులైన ప్రతి పేదవాడికి పెన్షన్ అందించడమే ఈ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని డి.సి.సి.బి.చైర్మన్, ఉండి నియోజకవర్గ వై.సి.పి.ఇన్‌చార్జి

పి.వి.ఎల్.నరసింహారాజు అన్నారు.పెద అమిరం గ్రామంలో ఏర్పాటు చేసిన కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తన తండ్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఒక్క అడుగు ముందుకు వేసి ప్రతి ఒక్కరికి మేలు చేసే విధంగా ప్రతీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం జగన్ ప్రభుత్వ మని,ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉన్నత చదువులు చవడానికి సహాయ పడుతున్న ప్రభుత్వం మన ప్రభుత్వం అని,అందరికి మంచి చేసే ఆయనకు మనమందరం అండగా ఉండాలని కోరారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి.సోమేశ్వరరావు, పి.సోమేశ్వరరావు, పి.విశ్వనాదరాజు, జె.కిశోర్, జె.సత్యం, ఎస్.ముఖేష్, బి.జాషువా, పార్టీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దిగమర్రులో ఇదేం ఖర్మ రాష్ట్రానికి

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు మండలం దిగమర్రు గ్రామంలో గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలకొల్లు శాసనసభ్యులు డా.నిమ్మల

రామానాయుడు హాజరయ్యారు. ఇంటింటికి తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎమ్మెల్యే నిమ్మల కు రహదారుల సమస్య, డ్రైనేజీ సమస్యలను వివరించారు. సమస్యలను నమోదు చేసుకున్న ఎమ్మెల్యే, పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

గడప గడపకు ప్రభుత్వం

విశాలాంధ్ర - భీమడోలు : పూళ్ళ గ్రామంలో ఎమ్మెల్యే వాసుబాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. సీఎం జగన్ చేపడుతున్న సంక్షేమ పథకాలు ద్వారా పేదలకు లబ్ధి చేకూరి వారికి ఆర్థిక స్వాలంభన కలుగు తుందని అన్నారు.భీమడోలు

మండలం పూళ్ళ గ్రామంలో గురువారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుబాబు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి అందుతున్న సంక్షేమ లబ్ధిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ ను ఈనెల నుండి 250పెంచి మొత్తంగా 2750 రూపాయలను అవ్వతాతలకు సీఎం జగన్ అందజేస్తున్నారని ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, మండల ప్రజాప్రతినిధులు,అధికారులు, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : వన్ టౌన్ లోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో కిష్కిందపురంలో వెలిసిన శ్రీ సీతా రామలింగేశ్వర స్వామి వారి పురాతన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యుల

పేరిట రూ. 10 లక్షల 33 వేల ను విరాళంగా ఆలయ అధికారులకు గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వర్దినిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఆలయ పున నిర్మాణానికి సంబంధించి భక్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రభుత్వం ద్వారా రూ కోటి నిధులను మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. భక్తుల భాగస్వామ్యంగా మూడో వంతు నిధులు 33 లక్షల 33 వేలను డిపాజిట్ చేయాల్సి ఉండడంతో, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్వయంగా కల్పించుకుని రూ 23 లక్షల వరకు భక్తుల నుండి సేకరించడం జరిగిందని అన్నారు. మిగిలిన రూ 10 లక్షల 33 వేల ను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివా స్ తన కుటుంబ సభ్యుల పేరిట ఆలయ నిర్మాణానికి విరాళంగా ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోలు తోట శ్రీనివాసరావు, కిషోర్ ,ఆలయ పాలకమండలి చైర్మన్ మందారపు శ్యాంసుందర్రావు, తోట భోగయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - పోడూరు : మండలం పరిధిలో ఉన్న ఆచంట నియోజకవర్గంలోని ఎనిమిది గ్రామాలకు సంబందించిన అర్హత కలిగినటువంటి 251 మందికి మంజూరయిన కొత్త పింఛన్లను స్థానిక శాసనసభ సభ్యులు చెరుకువాడ శ్రీ రంగనాథ రాజు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగనాధరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పింఛన్లు 2,500 నుండి 2750కు పెంచడం జరిగిందన్నారు. ఏ రాష్ట్రం లోను లేని విధంగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. జెడ్పిటిసి గుంటూరు పెద్దిరాజు మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు అండగా ఉండి విజయం చేకూర్చాలని అన్నారు వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణ రాజు ఎంపీటీసీ పోడూరి నాగరాజు వైసీపీ నాయకులు పోతుమూడి రామచంద్రరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

భూసేకరణకు రైతులు సహకరించాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: చింతలపూడి ఎత్తు పోతల పథకం భూసేకరణకు రైతులు సహకరించాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జి సూర్య నారాయణ రెడ్డి కోరారు. టి నరసాపురంలో అదనపు భూసేకరణకు రైతులతో

గురువారం సమావేశం నిర్వహించారు. స్థానిక రైతులు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు ప్రభుత్వం నుండి భూసేకరణకు నష్ట పరిహారం త్వరగా అందించడానికి కృషి చేస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జెవి సుబ్బారావు, విఆర్ఓలు గోపి,పుల్లా రావు, హెచ్ పుల్లా రావు పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ కోరుతూ సంతకాల సేకరణ

విశాలాంధ్ర-టి.నరసాపురం : మండల కేంద్రమైన టి. నరసాపురం పంచాయితీ పరిధిలోని కృష్ణాపురం, పుత్రేపు, ప్రకాష్ నగర్, రుద్రకోటరాజుగూడెం, కాపు గూడెం. ఐదు గ్రామలను కలిపి ప్రత్యేక గ్రామ పంచాయతి ఏర్పాటు

చేయాలని కోరుతూ మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన యువకులు ప్రజల నుండి సంతకాలను సేకరించారు. టి. నరసాపురానికి ఈ ఐదు గ్రామాలు దూరం గా ఉండడం వల్ల అనేక అబివృద్ధి కార్యక్రమాలు అందడంలేదని ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. సంతకాలు సేకరించిన వారిలో భూక్యా వేణుగోపాల్, ధరవాత్తు స్వామి, జరబల బాలకృష్ణ, భూక్యా సుకలి, భూక్యా రాములు, ధరవత్తు కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీఓ 1ను తక్షణమే రద్దు చేయాలి

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్రంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్ షోలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రజా వ్యతిరేక జీవో 1ను తక్షణమే రద్దు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక

కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 1ను నిరసిస్తూ గురువారం ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లంక మాట్లాడుతూ భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 1వ నంబర్ జీవో అప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ నియంతల మాదిరిగా చీకటి జీవోలు జారీ చేస్తూ నిరంకుశ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజలు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు కనుమూరి వెంకటపతిరాజు, మోకా పరమేశ్వరావు, బొడ్డు వెంకటేశ్వరరావు, బి.ఎన్.రామకృష్ణ, ఎస్.నాగవెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో ఆర్.ఆర్.డిఎస్. ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర -భీమవరం: నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఆర్.ఆర్.డిఎస్. ప్రభుత్వ కళాశాల విద్యార్థులు బి.చిరంజీవి, డి.ఎలీషా

రజిత పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతం, డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, డాక్టర్ అరవింద స్వామి, డాక్టర్ రాజశేఖర్, పిడి మన్నే శివనాగరాజు, సిబ్బంది, విద్యార్థులు విజేతలను అభినందించారు.

గ్రామాల్లో అవగాహన సదస్సు

విశాలాంధ్ర - వేలేరుపాడు : సంక్రాంతి పండుగ సందర్భంగా చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించకూడదని స్థానిక ఎస్ఐ ఆర్ శ్రీను ఆధ్వర్యంలో గురువారం ఎర్రబోరులో అవగాహన సదస్సు నిర్వహించారు. కోడిపందాలు,

గుండాట, అశ్లీల నృత్యాలు తదితర అసాంఘిక కార్యక్రమాలు నిషేధించబడ్డాయని పేర్కొన్నారు. వాటిని ఎవరు అతిక్రమించిన నిర్వాహకులు, పాల్గొన్న వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. వాటి స్థానంలో సాంప్రదాయ క్రీడలైన వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, కోకో తదితర సాంప్రదాయ క్రీడలను నిర్వహించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : రాబోయే సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని జీలుగుమిల్లి సిఐ బి. వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం జీలుగుమిల్లిలో రామాలయం వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందాలు, జూదాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగను సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని అన్నారు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి పోలీసు సిబ్బంది జిఎంఎస్ కె లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీ తెలుగులో బింబిసార సినిమా, చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి సీరియల్ ప్రసారం

విశాలాంధ్ర -భీమవరం : జీ తెలుగు ఛానల్ లో బింబిసార సినిమా ను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా ప్రసారం చేయబోతున్నామని, ఈ సినిమాను జనవరి 8, 2023 సాయంత్రం 6 గంటలకు ప్రసారం చేస్తున్నామని ఆ ఛానల్ ప్రతినిధి చెప్పారు. సినిమా కథ విషయానికి వస్తే బింబిసారుడు మహాక్రూరుడని అధికారమే పరమావధిగా త్రిగర్తల సామ్రాజ్యాన్ని పరిపాలిస్తుంటాడని, మాయ అద్దం దొరకడం, ఆ అద్దం వలన అతనికి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి, ధన్వంతరిని దక్కించుకోవాలన్న దుష్టుల ఆకాంక్ష ఫలించిందా అనేది మిగిలిన కథ అన్నారు. చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి అనే సీరియల్ ప్రసారం కాబోతోందని, ఈ సీరియల్ జనవరి 9 సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 2.30లకు ప్రసారం అవుతుందన్నారు. ఈ సీరియల్ భాగ్యలక్ష్మి అనే అమ్మాయి చుట్టూ తిరుగుతుందని, భాగ్యలక్ష్మి ఉన్నత భావాలు గల అమ్మాయి. తనకు ఉన్నా లేకపోయినా ఎదుటివారికి ఎల్లవేళలా సాయం చేయాలనే మంచి మనసు కలిగి ఉంటుందని, మరోవైపు మిత్రా గ్రూప్ ఆఫ్ కన్స్ట్రక్షన్ కంపెనీ వారసుడు మిత్రా నందన్ తన కష్టంతో కంపెనీని ఉన్నత స్థాయికి తీసుకువెళ్తాడు. డబ్బుంటే ఏదైనా సాధించవచ్చు అనే మనస్తత్వం కలిగినవాడు. విరుద్ధ భావాలున్న వీరిద్దరి జీవితాలు, పెళ్లి తర్వాత ఎలా మారాయి అనేదే అసలు కథ అన్నారు.

ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి గ్రామంలో గురువారం ఆదిశంకరాచార్యు దాన్య మందిరం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు వివిధ హోమాలు ఘనంగా నిర్వహించారు సాయంత్రం ఈ కార్యక్రమానికి ప్రవచన చక్రవర్తి డాక్టర్ బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ప్రవచనాలు గురు వైభవం శంకర విజయం చేశారు ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చైర్మన చలం చర్ల హరినాథ్ నారాయణ విశ్వేశ్వరరావు తోట సత్యనారాయణ మహిళా భక్తులు మండలంలోని ఆయా గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అవ్వా తాతల ఆనందమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - గణపవరం : అవ్వ తాతల ఆనందమే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యమని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీని వాసరావు (వాసు బాబు) అన్నారు. గురు వారం గణపవరం శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ భవనంలో నూతనగా మంజూరైన పెన్షన్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పేదల పక్ష పార్టీ అని అన్నారు.ఏ ఒక్క పెన్షన్ తొలగించ కుండా కొత్త పెన్షన్ల ను మంజూరు చేసి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని నిరూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూరా అలంకారం, వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ దండురాము, వైస్ ఎంపీపీ సలాది రత్న దుర్గ కుమారి, రొంగల శ్రీను, తోట శ్రీను ,ఎంపీడీవో గద్దల జ్యోతిర్మయి, ఎంపీటీసీలు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర- ముసునూరు : ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరిట ఎన్నో సంక్షేమపథకాలు తీసుకు వచ్చారని నూజివీడు శాసన సభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కొనియాడారు. గురువారం మండలంలోని ముసునూరు జిల్లా పరిషత్ వున్నత పాఠశాల ఆవరణలో నూతన పింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2500లు ఇచ్చే ఫించన్ రూ.2750లు ఇస్తున్నామని, రైతు భరోసా,ఆమ్మ ఒడి,విద్యా దీవేన,విద్యావసతి ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు పేద, బడుగు,బలహీన వర్గాల వారికి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్,ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి,వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన,సర్పంచ్‌లు పేరంకృష్ణ ,నక్కనబోయిన సత్యనారాయణ,రంగు ధనలక్ష్మిగాంధీ,చలసాని దామోదరరావు, వైస్ ఎంపిపి-2 పాముల గంగధరరావు, ఎంపిడివో జి.రాణి, తహసీల్దార్ దాసరి సుధ,రేగుల గోపాలకృష్ణ, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నవోదయ ఎంట్రన్స్ పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర - పాలకొల్లు: నవోదయ హైస్కూల్లో 6 వ తరగతిలో చేరేందుకు, 5వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఎంట్రన్స్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలని పాలకొల్లు ఎంఈఓ ప్రసాద్ కోరారు. పాలకొల్లు వీవర్స్ కాలనీలో జీవిఎస్ వి మున్సిపల్ పాఠశాలలో గురువారం 5వ తరగతి విద్యార్థులకు భీమవరం ఆర్డీవో దాసి రాజు ఆర్థిక సహాయంతో అందజేసిన నవోదయ ఎంట్రన్స్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం భవాని ప్రసాద్ పర్యవేక్షించారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు

విశాలాంధ్ర - పెదవేగి : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాడు నేడు కార్యక్రమం లో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చి అధునాతన సౌకర్యాల తో కూడిన తరగతి గదులలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అని దెందులూరు శాసన సభ్యులు కఠారు అబ్బయ్యచౌదరి అన్నారు.పెదవేగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.81.50 లక్షల ప్రభుత్వనిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఎంపిపి తాతా రమ్య కుమార్ తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం ఎల్ ఏ అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ పాఠశాలలను అధునాతన సౌకర్యాలతో నిర్మించిందన్నారు. ఈ కార్యక్రమం లో పెదవేగి సొసైటీ చైర్ పర్సన్ పివి సుబ్బారావు, దెందులూరు ఏఎంసి చైర్మన్ మెకా లక్ష్మణరావు, డిసిసిబి డైరెక్టర్ పెదవేగి మాజీ సర్పంచ్ తాతా సత్యనారా యణ,ఎంఈఓ బుధవ్యాస్, ఆర్ గంగాధర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - వేలేరుపాడు : సంక్రాంతి పండగ సందర్భంగా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఏవి నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని స్థానిక తహశీల్దార్ చల్లన్నదొర, ఎస్సై ఆర్. శీను హెచ్చరిం చారు. తహసిల్దార్ కార్యాలయంలో గురువారం స్థానిక సిబ్బందితో సమావేశం

ఏర్పాటు చేశారు. మండలంలో ఎక్కడైనా కోడి పందాలు, గుండాట, పేకాట తదితర జూదాలు ఏవి నిర్వహించిన చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. యువత జూదాల్లో పాల్గొని తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవిన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ఇంటి స్థలాలు

విశాలాంధ్ర -కైకలూరు : అర్హులై ఇళ్ల లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లను నిర్మించుకోవ డానికి ఒక్కో ఇంటికి రూ.1,80,000 ప్రభుత్వం అందిస్తుందని మీకోసం ఇంత చేస్తున్న ప్రభుత్వ అధినేత జగనన్న

కలను సాకారం చేయాలంటే మీరంతా త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలని కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు ఇళ్ల లబ్ధిదారులను ఉద్దేశించి అన్నారు. కైకలూరులోని వైయస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్ నందు ఇళ్ల పట్టాలను పొంది ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టని లబ్ధిదారులతో, వాలంటీర్లతో, ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆశీస్సులతో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అతి పెద్దదైన 94.5 ఎకరాలు సువిశాలమైన లేఔట్ తయారుచేసి.. ఆరడుగుల మేర మెరక చేయించి 2989 మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకట కృష్ణమోహన్, వైస్ ఎంపీపీ మహమ్మద్ జబీర్ గ్రామ సర్పంచ్ డిఎం. నవరత్న కుమారి ఎమ్మార్వో మురళీకృష్ణ ఎంపీడీవో రామలింగేశ్వరరావు టౌన్ సిఐ నాగరాజు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శరన్ హౌసింగ్ ఏఈ శేఖర్ నాయకులు అబ్దుల్ హమీద్ తోట మహేష్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గ్రామ వాలంటీర్లు ఇళ్ళ లబ్ధిదారులు పాల్గొన్నారు.

దుర్మార్గమైన జీవోను రద్దు చేయాలి

విశాలాంధ్ర - కుక్కునూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు, వామపక్ష పార్టీలు ప్రజాస్వామ్య పద్ధతిలో, ప్రజా సమస్యలపై ప్రజా పోరాటాలు చేపట్టకుండా, ప్రజావ్యతిరేకవిధానాలపై, నిరసన తెలియచేయకుండా, జీవో నెంబర్ ఒకటి, జారీ చేయడం దుర్మార్గమని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్కే గౌస్ అన్నారు. ఆ పార్టీ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే వాటిని పరిష్కరించడానికి ముందుకు రాని ప్రభుత్వం అక్రమ జీవోలు ద్వారా ప్రశ్నించే గొంతుకలను మూయించాలని దురుద్దేశంతో జిఓ నెంబర్ 1 జారీ చేయటం చట్ట విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపందా కుక్కునూరు మండల కార్యదర్శి బాసిన సత్యనారాయణ, కల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.